క్లుప్తంగా

శాకంబరీదేవిగా వేళ్లమ్మ అమ్మవారు



కోడూరు: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని లింగారెడ్డిపాలెంలోని వేళ్లమ్మ అమ్మవారిని గురువారం శాకంబరీదేవిగా అలంకరించారు. గర్భాలయంలోని మూల మూర్తిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణమంతా మిర్చి, బీరకాయలు, సొరకాయల తోరణాలతో అలంకరించారు. గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

పులిగడ్డ(అవనిగడ్డ): గ్రామ పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటునందించాలని సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వెలుగు ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అందిస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి అనిత, పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జవాను కుటుంబానికి స్థలం పట్టా అందజేత



పెడన: మండల పరిధిలోని చేవేంద్ర గ్రామానికి చెందిన సాదరబోయిన నాగరాజు ఏడాదిన్నర కిందట సైనిక విన్యాసాల్లో మృతిచెందారు. ఆయన భార్య మంగాదేవికి గురువారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ 300 గజాల స్థలం పట్టాను అందజేశారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు బందరు మండలం రుద్రవరంలోని 300 గజాల స్థలాన్ని ఆమె పేరుమీద రాసిన పట్టాను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సైనికాధికారిణి కల్యాణవీణ, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఎన్నికలు ఏకగ్రీవం



గూడూరు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ గూడూరు మండల శాఖ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మచిలీపట్నంలోని జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో గూడూరు మండల శాఖ అధ్యక్షుడిగా కె.అలీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సి.శేఖర్, మహిళా అధ్యక్షురాలిగా వి.ఎ.జ్యోతి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా అధ్యక్షుడు ఎ.సుబ్రహ్మణ్యం, ఎన్నికల అధికారిగా ఎ.ఆర్.గోపాల్ వ్యవహరించారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత డొల్ల



బంటుమిల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో నూతన భవన నిర్మాణ పనుల నాణ్యతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. గత రెండు రోజులుగా ఫౌండేషన్ పనులు పూర్తి చేసిన గుత్తేదారు ఫౌండేషన్ నీటితో క్యూరింగ్ చేయకుండానే గురువారం మట్టితో పూడ్చి వేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫౌండేషన్ పనులను క్వాలిటీ కంట్రోలు అధికారులు పర్యవేక్షించిన దాఖలాలు తెలియడంలేదు. దాదాపు 14 అంగుళాలు ఫౌండేషన్ గట్టిపడాలంటే కనీసం రెండు, మూడు రోజులైన వాటర్ క్యూరింగ్‌లో ఉండాలని పలువురు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. దాదాపు 10 అడుగుల లోతులో మట్టి తీసి రేఫ్ట్ ఫౌండేషన్ సుమారు 14 అంగుళాల మందాన నిర్మించాడు. గత కొద్ది రోజులుగా మండుతున్న ఎండలకు గుత్తేదారు ఫౌండేషన్‌కు నీళ్లతో కూరింగ్ చేయకుండా మట్టితో పూడ్చివేశారు. ఆర్ అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో నిర్మాణం జరుగుతున్న పీహెచ్‌సీ భవనం పునాదిలోనే తలెత్తిన నిర్మాణ లోపాలను ఉన్నతాధికారులు విచారణ చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈఈ కిషోర్ మాట్లాడుతూ కాంట్రాక్టరు ఫౌండేషన్ మట్టితో పూడ్చిన విషయం తన దృష్టికి రాలేదన్నారు. పనులు నిలిపివేసి వెంటనే వేసిన మట్టి బయటకు తీసి వాటర్ క్యూరింగ్ చేయిస్తామని పేర్కొన్నారు.

జాడలేని సాగునీరు

- ఆక్రమణల చెరలో పంట బోదె
- పంట పొలాలకు అందని నీరు
- ఆందోళనలో అన్నదాతలు



నీరులేని పంట బోదెకు ఇరువైపులా బంజరు భూములుగా కనిపిస్తున్న పంట పొలాలు

చల్లపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 45 రోజులు దాటుతున్నా.. ఇప్పటి వరకు చుక్కనీరు కూడా తమ పొంట పొలాల్లోకి రాకపోవడంతో మండల పరిధిలోని లక్ష్మీపురం, రామానగరం ప్రాంతాలకు చెందిన 130 మందికిపైగా చిన్న, సన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పొలాలకు సాగునీరు సరఫరా చేసే పంట బోదె ఆక్రమణల చెరలో ఉండటంతో దిగువకు సాగునీరు వచ్చే పరిస్థితి లేదు. 6వ నంబర్ పంట కాలువ దూరంగా ఉన్న కారణంగా ప్రతి ఏటా సాగునీటికి ఇబ్బందులు రావడంతో కొందరు రైతులు స్వచ్ఛందంగా నిధులు సమకూర్చుకుని ఘంటసాల రోడ్డు వరకు పంట బోదెను తవ్వించుకున్నారు. అందులో వచ్చే నీటితోనే సాగు చేసుకుంటున్నారు. కాలక్రమంగా రామానగరం – ఘంటసాల రోడ్డులో వర్రల కంపెనీ వద్ద కొందరు ఈ పంట బోదెపై చిన్న తూములు వేసి, పశువుల పాకలు నిర్మించి ఆక్రమించుకున్నారు. బోదె మెరక వేసుకుపోవడంతో పై నుంచి వస్తున్న సాగునీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఆయా ప్రాంత రైతులు ప్రతిఏటా సరైన సమయానికి సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

అందరూ సన్న, చిన్నకారు రైతులే

లక్ష్మీపురం, రామానగరం ప్రాంతాల మధ్య ఉత్తరం వైపున గతంలో భూమిలేని నిరుపేదలైన 100 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఒక్కొక్కరికీ 20 సెంట్లు చొప్పున 20 ఎకరాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. అప్పటి నుంచి వారు ఈ భూమినే సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తాజాగా పంటబోదె ఆక్రమణకు గురి కావడంతో చుక్కనీరు కూడా వారి పంట పొలాల వైపు పారడం లేదు. అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందగా కాలువలో నీరు పుష్కలంగా ఉన్నా సాగునీరు తమ వరకు రాకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. విసుగెత్తిన రైతులు బోదెపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ డి.వనజాక్షికి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది వచ్చి పంటబోదెపై ఉన్న కొన్ని ఆక్రమణలు తొలగించారు. మరికొందరు అడ్డుచెప్పడంతో వెళ్లిపోయారు. మిగిలిన ఆక్రమణల విషయంలో అధికార పార్టీ నాయకులు, మీరు చూసుకోండని తహసీల్దార్ సలహా ఇచ్చినట్లు రైతులు చెబుతున్నారు.



పంటబోదెపై తూములు వేసి నిర్మించిన పశువుల పాక

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

ఈనెల 14వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ డి.కె.బాలాజీకి ఫిర్యాదు చేశారు. పంటబోదెపై ఆక్రమణలు తొలగించి వెంటనే సాగునీరు అందించకపోతే క్రాప్ హాలిడే ప్రకటించడం తప్ప తమకు మరో గత్యంతరం లేదని కలెక్టర్‌కు విన్నవించారు. అధికారులు వచ్చి మీ సమస్యను పరిష్కారిస్తారని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి కూడా వచ్చి ఆక్రమణలు పరిశీలించిన పాపాన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో సాగు చేపట్టకపోతే అదునుపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అధికారులు వెంటనే ఆక్రమణలు తొలగించి తమ పొలాలకు సాగునీరు అందేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సహకరిస్తాం

జీ.ఓ.నెం.188 ప్రకారం పంట బోదెపై ఉన్న ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత తహసీల్దార్, పంచాయతీ వారిదే. ఆక్రమణలు తొలగించేందుకు వారు వస్తే మా సహకారం కూడా అందిస్తాం.

–రామ్‌కుమార్, ఏఈ, ఇరిగేషన్ శాఖ, చల్లపల్లి

అధికారులు పట్టించుకోలేదు



పంట బోదెపై ఆక్రమణలు తొలగించి పూడిక తీస్తే తప్ప సాగునీరు దిగువకు రాదు. తహసీల్దార్‌కి చెప్తే పట్టించుకోలేదు. కలెక్టర్ వద్దకు వెళితే నెలలోపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. నెల తర్వాత సమస్య పరిష్కరిస్తే ఉపయోగం ఏమి ఉంటుంది.

–వై.నాంచారయ్య, రైతు, రామానగరం

చుక్కనీరు లేదు



ఇప్పటి వరకు బోదెల్లో చుక్కనీరు రాలేదు. నారు మడులు కూడా వేసుకోలేదు. నారు బయట నుంచి కొనుక్కోవాలి. నీళ్లు ఎప్పుడు వస్తాయో... నాట్లు ఎప్పుడు వేసుకోవాలో అర్థం కావడం లేదు.

–మేరుగు యానాది, రైతు, రామానగరం

రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి



శిక్షణలో మాట్లాడుతున్న మల్లేశ్వరి

పెడన: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేలా ప్రోత్సహించాలని ఏపీసీఎన్ఎఫ్ ఎడిషన్ డీపీఎం మల్లేశ్వరి సూచించారు. గురువారం స్థానిక పెడన వ్యవసాయ మార్కెట్ యార్డులోని సమావేశం హాలులో పెడన నియోజకవర్గంలోని వీఏఏలు, ఎంపీఈవోలకు మూడు రోజులు పాటు పీసీఎన్ఎఫ్, వ్యవసాయశాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై చాలా మంది రైతులు ఆసక్తి చూపిస్తున్నారే తప్ప ఆచరణ చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. అటువంటి వారికి పూర్తిగా అవగాహన కల్పించి దానిపై దృష్టి సారించేలా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్ర వ్యవసాయ సహాయ సంచాలకులు కె. శ్రీనివాస్, మచిలీపట్నం ఏడీఏ ఎన్. రమాదేవి, పెడన ఏవో ఎస్. జెన్నీ, ట్రైనీలు స్వామి, వినుకొండ పాల్గొన్నారు.

రోడ్లపై దమ్ము చక్రాలతో తిరిగితే జరిమానా



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి తహసీల్దారు అనిల్‌కుమార్

పెడన: ప్రధాన రహదారుల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు తిరిగితే జరిమానా విధించడం లేదా జైలుకు పంపించడం జరుగుతుందని ఇన్‌ఛార్జి తహసీల్దారు కె. అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన ట్రాన్స్‌పోర్టు అధికారులతో కలిసి తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు(మహిళా పోలీసులు), వీఆర్వోలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ పంట పొలాల వద్ద దమ్ము చక్రాలు మార్చుకునేలా ట్రాక్టర్ డ్రైవర్లు చూసుకోవాలన్నారు. దమ్ము చక్రాలతో రోడ్లపై తిరిగితే మొదటిసారి కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని, రెండోసారి రూ.5వేలు జరిమానా విధించాలని సూచించారు. రోడ్లు భవనాల శాఖ వారి తనిఖీల్లో పట్టుబడితే రోడ్డు దెబ్బతిన్నందుకు నష్టపరిహారం చెల్లించడం, జైలుకు పంపించేలా శిక్షలు ఉన్న విషయం తెలియజేయాలని చెప్పారు. గ్రామాల్లో వీటిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ట్రాన్స్‌పోర్టు అధికారులు మురళీకృష్ణ, ఎంపీఐలు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై గ్రామసభ

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): పీ–4లో భాగంగా ఇంటింటా సర్వే చేసి గ్రామంలో 96 పేద కుటుంబాలను గుర్తించినట్లు మండల పరిషత్ ఏఓ ఆకుల పాండురంగారావు తెలిపారు. మండలంలోని ఉత్తర చిరువోలులంక, మేళ్లమర్తిలంక గ్రామంలో సర్పంచ్ చింతా శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం సోషల్ ఆడిట్‌పై గ్రామ సభ నిర్వహించారు. పేద కుటుంబాల వివరాలను గ్రామ కార్యదర్శి వల్లభనేని నాగబాబు సభలో చదివి వినిపించారు. అవసరమైతే మార్పులు, చేర్పులు చేస్తామని తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నడకుదుటి ఉమామహేశ్వరావు, పీఏసీఎస్ కార్యదర్శి అల్లంశెట్టి ఏసయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ లుక్కా రాణి, మేళ్లమర్తిలంక గ్రామ కార్యదర్శి మోహనకృష్ణ, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇతర సామాజిక వర్గాల వారి నియామకం తగదు

అవనిగడ్డ: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారిని నియమించడం వల్ల ప్రయోజనం ఏమిటని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ ప్రశ్నించారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో అవనిగడ్డ నియోజకవర్గంలో ఇతర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారిని సభ్యులుగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘంటసాలలో భారీ వర్షం


ఘంటసాల: ఘంటసాలలో గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. సుమారు గంటకు పైగా వర్షం పడటంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఘంటసాల – రామానగరం, ఘంటసాల పశువుల ఆసుపత్రి రోడ్డు మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షానికి శ్రీకాకుళం సెంటర్‌లోని రెండు కొబ్బరి చెట్లపై పిడుగులు పడటంతో మంటలు చెలరేగాయి. పిడుగు పడిన పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ప్రమాదం కలగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే ఘంటసాల కల్యాణ మండపం రోడ్డులో చెట్టు కొమ్మ విరిగిపడిపోయింది.

రోడ్లు జలమయం

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధానంగా పంచాయతీకి వెళ్లే సీసీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతోనే వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోయందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు, పాలకులు స్పందించి డ్రెయినేజీ పూడికలు తీయించాలని కోరుతున్నారు.

నగరాన్ని కమ్మేసిన కారుమబ్బులు

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంను గురువారం మధ్యాహ్నం కారుమబ్బులు కమ్మేశాయి. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో జనాలు అల్లాడారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై నగరాన్ని చుట్టుముట్టాయి. దీంతో చల్లగాలులు వీచాయి. ఎండ, వేడి గాలులతో ఇబ్బందిపడ్డ నగర ప్రజలు సేద తీరారు. వర్షం కురుస్తుందని భావించినా మబ్బులు తేలిపోవడంతో కురవలేదు.



శ్రీకాకుళంలో పిడుగుపాటుకు కాలుతున్న కొబ్బరిచెట్లు



మచిలీపట్నం నగరంపై కమ్మిన కారుమబ్బులు



ఘంటసాలలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు



మోపిదేవిలో వర్షంనీటిలో మునిగిన రోడ్డు

రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణా శాఖాధికారి మురళీధర్

అవనిగడ్డ: రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కృష్ణాజిల్లా రవాణా శాఖాధికారి పి. మురళీధర్ సూచించారు. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థలో గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై నడిచేటప్పుడు, వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. దీనివల్ల ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. మైనర్లు వాహనాలు నడపొద్దని, వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ సిద్ధిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

దివి ఏఎంసీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సమక్షంలోనే వాగ్వాదం పడుతున్న వెంకటనాథ్, కొల్లూరు, బాలవర్ధిరావు

రేమాలవారిపాలెం(నాగాయలంక): దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు స్థానిక నాగాయలంక మార్కెట్ యార్డు ప్రాంగణంలోని కమిటీ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీని ప్రగతిపథంలో నడపాలని సూచించారు. ఛైర్మన్‌గా కొల్లూరి వెంకటేశ్వరరావు, వైస్‌ఛైర్మన్‌గా రాజనాల వీరబాబు(అవనిగడ్డ), సభ్యులుగా జరుగు ఆదినారాయణ, కారాని సరస్వతి, కొక్కిలిగడ్డ లక్ష్మీకుమారి, మంగళగిరి శ్రీనివాసరావు, మాతంగి వెంకటేశ్వరమ్మ, పల్లి మహేశ్వరి, పిరాటి శిరీష, పుప్పాల పెద యేసు, షేక్ పర్వీనా, ట్రేడర్ల కేటగిరీలో మెరకనపల్లి నరేష్, తలశిల లలిత, ఉప్పల శివరాఘవ వరప్రసాద్, విశ్వనాథపల్లి సోమేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతన ఛైర్మన్ కొల్లూరి, డైరక్టర్లను ఎమ్మెల్యే సన్మానించారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియుల కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, కూటమి నాయకులు, మార్కెటింగ్ కమిటీ అధికారులు, డీసీఎంఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూటమి నేతల మధ్య రగడ

దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణలో మరోమారు కూటమి నేతల మధ్య ఆధిపత్య పోరు బయట పడింది. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సమక్షంలోనే జనసేన, టీడీపీ నేతలు మాటల బాణాలు సంధించుకున్నారు. వేదికపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పదవి ఆశిస్తున్న ఎస్ఆర్‌వి బొబ్బా గోవర్ధన్ కూర్చోవడంపై జనసేన నాయకుడు బచ్చు వెంకటనాథ్ అభ్యంతరం తెలపడం వివాదానికి దారితీసింది. దీనిపై నూతన ఛైర్మన్ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మండవ బాలవర్ధిరావు కలుగజేసుకోవడంతో ఘర్షణ పెరిగి పెద్దగా అరుచుకుంటూ కేకలు వేసుకున్నారు. ఇదిలా ఉండగా కనీస మర్యాద, గుర్తింపు లేదంటూ పలువురు టీడీపీ నేతలు వెనుదిరిగి వెళ్లిపోయారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



మోపిదేవిలో స్వామివార్లకు ఆషాఢ సారె సమర్పించిన భక్తులు



లంకమ్మ వారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి విజయవాడ రామలింగేశ్వర నగర్ విద్యాపీఠం ఆధ్వర్యంలో గురువారం ఆషాఢ సారె సమర్పించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థానం తరపున ఆలయ డెప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు, వేద పండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ ఆషాఢ సారె అందుకున్నారు. విద్యాపీఠం ప్రతినిధి జయరామశాస్త్రి మాట్లాడుతూ విద్యాపీఠం తరపున స్వామివారిని అల్లుడుగా భావన చేస్తూ ఈ ఆషాఢ పట్టి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లంకమ్మ వారికి సారె

అవనిగడ్డ: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం లంకమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు చెన్నగిరి మల్లికాంబ, మానేపల్లి పార్వతి, ఘంటసాల పద్మ, మానేపల్లి హైమావతి, దేసు శేషు, విస్సంశెట్టి శ్రీనివాస్, కొల్లిపర రాధాకృష్ణ పాల్గొన్నారు.



కోడూరు గంగాభవానీ అమ్మవారికి సారె తీసుకువస్తున్న మహిళలు

గంగాభవానీ అమ్మవారికి..

కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారికి గురువారం గ్రామానికి చెందిన మహిళలు ఆషాఢ సారెను సమర్పించారు. డప్పు వాయిద్యాల నడుమ పట్టువస్త్రాలు, గాజులు, పసుపు, కుంకుమతో పాటు వివిధ రకాల పండ్లను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. సారె ఊరేగింపులో మహిళలు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ అమ్మవారికి పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎట్టకేలకు బస్టాండ్ ఆవరణ ఫ్లోరింగ్ పనులు ప్రారంభం



బంటుమిల్లి బస్టాండ్ సిమెంటు ఫ్లోరింగ్ పనులు పర్యవేక్షిస్తున్న డీఎం తదితరులు

బంటుమిల్లి: స్థానిక బస్టాండ్ ఆవరణలో సిమెంటు ఫ్లోరింగ్ పనులు గురువారం ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కృష్ణా ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్‌గా పనిచేసిన పిన్నెంటి మహేష్ కృషితో బస్టాండ్ అభివృద్ధికి రూ. 40 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. గత ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావులు ముఖ్యఅతిథిలుగా పాల్గొని 2024 మార్చి 3న శంకుస్థాపన చేశారు. తర్వాత ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనుల ప్రారంభంలో జాప్యం జరిగింది. ఒకదశలో నిధులు మురిగిపోయినట్లు, అభివృద్ధి పనులు కొండెక్కినట్టే అన్న మాటలు వచ్చాయి. ఈ క్రమంలో పిన్నెంటి మహేష్ ఆర్టీసీ అధికారుల చుట్టూ తిరిగి పనులు ప్రారంభించాలని కోరాడు. దాదాపు 17 నెలల తర్వాత బస్టాండ్ అభివృద్ధి పనులు మొదలు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే కృష్ణా – పశ్చిమ గోదావరి జిల్లాలకు కూడలిగా ఉన్న బంటుమిల్లిలో బస్టాండ్ నిర్మించి దాదాపు 40 ఏళ్లకు పైగా అవుతోంది. నాటి నుంచి నేటి వరకు ఎటువంటి అభివృద్ధి పనులకు నోచుకోలేదు. ఇటీవల బస్టాండ్ ఆవరణలో వ్యాపార దుకాణాల సముదాయం నిర్మించేందుకు స్థలాలు వేలం నిర్వహించారు. మంజూరైన నిధులతో ఆవరణ సిమెంటు ఫ్లోరింగ్‌తోపాటు మిగిలిన ఖాళీ స్థలాన్ని మెరక చేసి సంస్థ ఆధీనంలోని పెట్రోలు బంకుకు కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పనులు పర్యవేక్షించిన మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజరు టి. పెద్దిరాజు తెలిపారు. ప్రయాణికులు ప్రమాదకరమైన ఆటోలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సులో సురక్షితంగా గమ్యానికి చేరాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగునికి కృత్రిమ కాలు

గుడివాడటౌన్: భారత్ వికాస్ పరిషత్ సేవా కార్యక్రమాల్లో భాగంగా దివ్యాంగునికి కృత్రిమ కాలు ఏర్పాటు చేసినట్లు భారత్ వికాస్ పరిషత్ గుడివాడ అధ్యక్షురాలు తిరుమలశెట్టి హారిక తెలిపారు. 30 ఏళ్ల ఎ.వెంకటేష్ ప్రమాదవశాత్తు కాలు కోల్పోగా కృత్రిమ కాలు ఏర్పాటు చేశారు. భారత్ వికాస్ పరిషత్ సభ్యులు రూప్‌చంద్ జైన్, డాక్టర్ రాధాకృష్ణ, జి.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com